క్లుప్తంగా

రేపు కౌన్సిల్ మీట్

హిందూపురం: మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఈమేరకు మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ బలరామిరెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలో మొత్తం 49 అంశాలను పొందుపర్చగా అందులోని అంశాలపై విమర్శలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్లు, డ్రైనేజీలు నిర్మించుకోవడానికి ప్రతి వార్డుకు రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఎన్నికల కోడ్ కారణంగా పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. పనులు పూర్తి కాలేదని సాకుతో వాటిని రద్దు చేయాలని అజెండాలో పొందుపరిచినట్లు ప్రతిపక్ష కౌన్సిలర్లు విమర్శిస్తున్నారు. వేసవిలో అత్యవసర పనుల కోసం విడుదలైన రూ.2.50 కోట్లను మోటర్ల మరమ్మతులు, వైరింగ్‌లంటూ కమిషన్ల కోసం కేటాయిస్తున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. పూడికల తొలగింపు పేరుతో ఏకంగా రూ.40 లక్షలు కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తాగునీటి సమస్య తీర్చండి



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న మహిళలు

మడకశిర: పట్టణంలోని గాంధీబజార్, బోయవీధి తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పర్యటించారు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్య తీర్చాలని కోరారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఏఎస్‌ఐ

అమరాపురం: వైఎస్సార్ సర్కిల్‌లో గురువారం సాయంత్రం ఏఎస్‌ఐ రామాంజనేయులు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటక సరిహద్దులో మండలం ఉండడంతో అక్రమంగా మద్యం, ఇతర వస్తువులు రవాణా చేస్తుంటారనే సమాచారం తెలుసుకుని పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రి వితరణ

అమరాపురం: క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్ (సీఏజీఎల్) ఆధ్వర్యంలో హేమావతి అంగన్‌వాడీ కేంద్రానికి చైర్లు, కార్పెట్లను గురువారం వితరణ చేశారు. సీఏజీఎల్ ప్రాంతీయ మేనేజర్ కె.గాస్పీర్, ఏరియా మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రాథమిక విద్యను ప్రోత్సాహించడంతో పాటు ప్రీ స్కూల్ పిల్లలకు ఆట పాటలతో ప్రశాంతమైన వాతావరణంలో ఉండేలా పోత్సహిస్తామన్నారు. కుర్చీలు, కార్పెట్లను అందించడంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఓంకారస్వామి, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ

అగళి: మధ్యాహ్న భోజనం పథకం కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు ఆదేశించారు. గురువారం ఇనగలూరు పాఠశాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందేలా చూడాలని ఉపాధ్యాయులు, ఏజెన్సీ నిర్వాహకులకు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలని సూచించారు.

ఉపాధి పనులపై గ్రామసభ



గ్రామ సభలో మాట్లాడుతున్న ఏపీఓ

అమరాపురం: మద్దనకుంట సచివాలయంలో గురువారం ఉపాధి హామీ పనుల ప్రణాళికపై సర్పంచ్ గోవిందరాయ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఏపీఓ జగదీష్ మాట్లాడుతూ పంచాయతీలోని గ్రామాల్లో ఏయే పనులు అవసరం, రైతులకు కావాల్సిన వాటిని గుర్తించి సభలో వివరాలను చదివి వినిపించారు.

అగళి: కోడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పనుల గుర్తింపుపై ఏపీఓ శివన్న ఆధ్వర్యంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ కింద చేపట్టే పనులకు సంబంధించిన ప్రణాళికను వివరించారు. టీఏ రమేష్, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

చెరువులకు నీరు.. సాగు జోరు

- పెరిగిన భూగర్భజల నీటి మట్టం
- పంటల సాగుకు సిద్ధమైన రైతులు
- డిసెంబర్ 15 వరకు పంటలు వేసుకోవచ్చు



నీటితో కళకళలాడుతున్న హునిసేకుంట చెరువు



రొళ్ల చెరువు ఆయకట్టు కింద వరి సాగుకు సిద్ధం చేస్తున్న దృశ్యం

రొళ్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు నిండాయి. భూగర్భజల నీటి మట్టం పెరిగింది. పంటల సాగుకు రైతులు ఉత్సాహంగా కదిలారు. మడకశిర నియోజకవర్గంలో రబీ సాగు ఈసారి జోరందుకోనుంది. రొళ్ల మండలంలోని రొళ్ల, హునిసేకుంట, చర్లోపల్లి, సీఎం ఘట్ట, జీజీ హట్టి, కాకి, కె.బ్యాడిగెర, రంగనపల్లి, ఎం.రాయాపురం గ్రామాల చెరువులు జలకళ సంతరించుకున్నాయి. రొళ్ల, బీజీహళ్లి, మల్లినమడుగు, ఎం.రాయాపురం, హులికుంట, హొట్టేబెట్ట, గుడ్డగుర్కి, రత్నగిరి, కాకి, దొడ్డేరి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఉపాధి హామీ, ఆర్డీటీ ద్వారా నిర్మించిన కుంటలు, చెక్‌డ్యాంలు, నీటి కట్టలు, ఫారంపాండ్‌లు నీటితో నిండాయి. మడకశిర, అమరాపురం, గుడిబండ, అగళి మండలాల పరిధిలోని చెరువులు, కుంటలు నిండుగా ఉన్నాయి. చెరువు అయకట్టు భూముల్లోని బోరుబావుల్లో అడుగంటిన భూగర్భజల నీటి మట్టం రోజురోజుకూ పెరుగుతోంది. ఈ సీజన్‌లో వరి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, మిరప, రాగి తదితర పంటలు సాగు చేసుకోవడానికి సన్నద్ధమవుతున్నారు.

డిసెంబర్ 15 వరకు సాగుకు అనుకూలం..

రబీ పంటల సాగుకు డిసెంబర్ 15వ తేదీ వరకు అనుకూలమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మడకశిర, రొళ్ల, గుడిబండ, అగళి, అమరాపురం మండలాల్లో 2,032 మంది రైతులు 1,954 ఎకరాల్లో సాగు చేశారు. 15వ తేదీ నాటికి సాగు విస్తీర్ణం మరింత పెరగనుంది.

మరువ నిర్మించండి..

జీజీ హట్టి చెరువుకు నీరు చేరినప్పటికీ మరువ లేకపోవడంతో వంకపాలవుతోంది. మరువ నిర్మిస్తే నీరు నిల్వ ఉండడంతో పాటు ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకోవచ్చునని రైతులు చెబుతున్నారు. నీళ్లు వృథాగా వెళ్లకుండా పూర్తిస్థాయిలో చెరువులో నిల్వ ఉంటే వ్యవసాయ బోరుబావుల్లో మరింత నీటి మట్టం పెరిగి సాగుకు మరింత అనుకూలంగా ఉండేదని రైతులు చెబుతున్నారు.

రబీలో ఇప్పటి వరకు సాగైన వివరాలు		
మండలం	రైతుల సంఖ్య	సాగు విస్తీర్ణం ఎకరాల్లో
రొళ్ల	725	816
అగళి	401	325
గుడిబండ	503	430
అమరాపురం	241	225
మడకశిర	162	158

నీటిమట్టం పెరిగింది



రొళ్ల చెరువుకు నీళ్లు చేరడంతో చెరువు ఆయకట్ట కింద ఉన్న వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భ జల నీటిమట్టం పెరిగింది. తూములో కొద్దిపాటి నీళ్లు వృథాగా పోతున్నాయి. నీటి వృథాను అరికట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం చెరువు నిండడంతో రెండేళ్ల వరకు పంట సాగుకు ఢోకా లేదు.

– బసవరాజు, రైతు, రొళ్ల

పోరాటయోధుడు మహాత్మా జ్యోతిరావు పూలే



హిందూపురంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మడకశిరలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఈరలక్కప్ప, నాయకులు



మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

హిందూపురం: బలహీన వర్గాల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి, సామాజిక స్వేచ్ఛ కోసం ఉద్యమాలు చేసిన పోరాటయోధుడు మహాత్మా జ్యోతిబా పూలే అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. పూలే 135 వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహాత్మా పూలే చిత్రపటానికి వేణురెడ్డి నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వేణురెడ్డి మాట్లాడుతూ పూలే సామాజిక సమానత్వం కోసం ఉద్యమించారన్నారు. ఆయన అడుగు జాడల్లోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన, మైనార్టీల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్‌ఏ.శివ, జిల్లా యువజన అధ్యక్షుడు లోకేష్, పట్టణ కన్వీనర్ మస్సూర్, కౌన్సిలర్లు నాగేంద్ర, ఆసీఫ్‌వుల్లా, మల్లికార్జున, నాయకులు మహేష్, చంద్రశేఖర్‌రెడ్డి, సీఏన్‌పీ నాగరాజు, శ్రీరాంరెడ్డి, శివశంకర్‌రెడ్డి, శ్రీరాములు, నరసింహులు, బాను పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సూగూరు వద్ద ఉన్న పూలే విగ్రహానికి లైఫ్ వరల్డ్ ఉదయకుమార్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన పూలే జీవిత చరిత్రను తెలియజేశారు. కార్యక్రమంలో మురళీమోహన్, మనోజ్, శ్యాంబాబు, ప్రభు, శివ, జానీ, జాన్‌బెన్నీ, బాల్‌రాజు పాల్గొన్నారు.

చిలమత్తూరు: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మల్లికార్జున మాట్లాడుతూ పూలే అందరికీ విద్య అందించాలని పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. మహిళా సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జ్యోతిరావు పూలే

మడకశిర/ మడకశిర రూరల్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావుపూలే అందరికీ ఆదర్శప్రాయుడని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గురువారం మడకశిరలో జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఈరలక్కప్ప మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ ఉద్యమానికి పునాదులు వేసిన తొలి సాంఘిక విప్లవకారుడని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో చైతన్యం తీసుకొచ్చిన ఘనత పూలేదేనన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లాయర్ మూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మప్ప, అన్సర్, మధుసూదన్, సత్యనారాయణ, అంజలి, రంగనాథ్, ఫక్రుద్దీన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని జిల్లెడుగుంట ప్రాథమికోన్నత, రేకులకుంట ఉన్నత పాఠశాలల్లో పూలే వర్ధంతి నిర్వహించారు.

ఘనంగా పూలే వర్ధంతి..

మడకశిర: పట్టణంలోని అమరాపురం బస్టాండ్ ఆవరణలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని గురువారం యూటీఎఫ్ నాయకులు ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ అధ్యక్షకార్యదర్శులు మాలింగప్ప, జోగప్ప, జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, కార్యదర్శి నరసింహప్ప మాట్లాడుతు అంటరానితనాన్ని ఎండగట్టిన గొప్ప సంఘ సంస్కర్త, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కోసం పాటు పడిన దీనజన బాంధవుడు, మహిళా అభివృద్ధికి బాటలు వేసిన విద్యావేత్త, మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గుడిబండ అధ్యక్షుడు మూడ్లగిరియప్ప, నాయకులు ఈశ్వర్, నరసింహమూర్తి, కదిరి శ్రీనివాసులు, ఓబన్న, మహంతేష్, దేవరాజు, హనుమంతరాయప్ప, ఉగ్రనరసింహ, రామాంజినేయులు, సూర్యప్రకాష్, శివప్ప పాల్గొన్నారు.

గుడిబండ: మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల జూనియర్ కళాశాలలో బడుగు, బలహీన వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు, సామాజిక ఉద్యమకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, విద్యార్థులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా జ్యోతిరావ్ పూలే వర్ధంతి

పెనుకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్, స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో పూలే వర్ధంతి వేడుకలను గురువారం నిర్వహించారు. హాస్టల్‌లో ఏఐఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పాల్గొన్నారు.

నేడు సోమందేపల్లిలో ఉషశ్రీచరణ్ పర్యటన

పెనుకొండ రూరల్: సోమందేపల్లిలోని గీతానగర్, ఈదులబలాపురంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ శుక్రవారం పర్యటించనున్నట్లు కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. పట్టణ, మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలని ఆ ప్రకటనలో కోరారు.

ముందస్తుగా పింఛన్ల పంపిణీ

హిందూపురం అర్బన్: డిసెంబర్ నెలకు సంబంధించి మండలంలో సామాజిక భద్రత పింఛన్లను ఒకరోజు ముందుగా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. డిసెంబర్ నెల 1న ఆదివారం కావడంతో ఈనెల 30న (శనివారం) పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు.

వీరభద్రుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి

గుడిబండ: చివరి కార్తీక గురువారం సందర్భంగా పట్టణ కేంద్రంలోని వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు ఆధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అరికట్టడమే లక్ష్యం



బాల్య వివాహాల నిర్మూలన కరపత్రాలను విడుదల చేస్తున్న సంస్థ ప్రతినిధులు

పెనుకొండ: బాల్య వివాహాలను అరికట్టడమే లక్ష్యమని సమతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, రీసోర్స్ పర్సన్ భాస్కర్ తెలిపారు. గురువారం పట్టణంలోని సమతా సంస్థ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్ వివాహ్ ముక్త్ భారత్ పేరుతో విద్యార్థులు, అధికారులు, ఇతర ముఖ్యులతో ప్రమాణం చేయించి బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా పని చేయాలని ప్రతిజ్ఞ చేయించారన్నారు. ఇందులో 276 ఎన్‌జీఓలు పని చేస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికల భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. విద్య, వైద్యం దూరమై అనారోగ్యం పాలయినట్లు తెలిపారు. రానున్న రోజులు పోలీసులు, ఉపాధ్యాయులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, అంగన్‌వాడీ సిబ్బంది ప్రతి ఒక్కరి సహకారంతో బాల్య వివాహాల నిర్మూలనకు పాటుపడుతామన్నారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు.

సృజనాత్మకత అలవర్చుకోవాలి



విద్యార్థినులతో సీడీపీఓ సునీత తదితరులు

పావగడ: విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకత అలవరచుకోవాలని సీడీపీఓ సునీత సూచించారు. స్థానిక గురుభవన్‌లో ఐసీడీఎస్, విద్యా శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తాలూకాస్థాయి అంతర్ పాఠశాలల జానపద నృత్య ప్రదర్శన, పోటీల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నిర్మాణాత్మక, సృజన శీలత కేవలం విద్య నుంచే వస్తుందన్నారు. విద్యార్థులు చదువు తో పాటు కవితలు,కథలు రాయడం అలవరచు కోవాలన్నారు. ఏదైనా ఒక విషయంపై తార్కికంగా ఆలోచన చేసే మనోభావాలను పెంచుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, మమత, పోషణ్ సంయోజకురాలు మంజుల, బీఆర్సీ సిబ్బంది విశాలాక్షి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహబూబ్‌బాషా సేవలు వెలకట్టలేనివి



గ్రంథాలయాధికారిని సన్మానిస్తున్న దృశ్యం

పెనుకొండ: పెనుకొండ శాఖా గ్రంథాలయాధికారి మహబూబ్‌బాషా సేవలు వెలకట్టలేనివని పలువురు వక్తలు ప్రశంసించారు. రాష్ట్ర మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ చేతన్ చేతులమీదుగా ఉత్తమ లైబ్రేరియన్‌గా మహబూబ్‌బాషా అవార్డు అందుకున్నారు. దీంతో ఆయన్ను పట్టణ ప్రముఖులు గ్రంథాలయాధికారిని గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు ప్రముఖ కవి జాబిలి చాంద్‌బాషా, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎంఎన్ మూర్తి, మానవ హక్కుల నాయకులు నంజుండ, ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దన్న, రామాంజనేయులు, నారాయణ తదితరులు మాట్లాడారు. ప్రతి రోజూ పాఠకులకు అందుబాటులో ఉంటూ వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో జాఫర్‌వలి, బాష, ఎల్ఐసీ ప్రతాపరెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా విధులకు హాజరుకావాలి



హాజరు పట్టికను పరిశీలిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం: సచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరుకావాలని మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ బలరామిరెడ్డి అన్నారు. పట్టణంలోని 6, 43వ వార్డు సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లోని హాజరు పట్టికను తనిఖీ చేశారు. హాజరు పట్టికలో సంతకం చేసి వెళ్లిపోయి ఇతర పనుల్లో నిమగ్నమైతే చర్యలు తప్పవన్నారు. విధులకు హాజరై సక్రమంగా విధులు నిర్వర్తించాలని ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. 6, 43వ వార్డుల్లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు.

కార్మికుడి కుటుంబానికి న్యాయం



చెక్కు చూపుతున్న కార్మిక సంఘ నాయకులు

హిందూపురం: విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి న్యాయం జరిగిందని తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్ తెలిపారు. గోళాపురం పారిశ్రామిక వాడలో ఏవన్ ఇస్పాత్ స్టీలు పరిశ్రమలో గతేడాది డిసెంబర్ 12న ప్రమాదవశాత్తు విధి నిర్వహణలో బిహార్‌కు చెందిన వలస కార్మికుడు సోమనాథ్ మహతో మరణించాడన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం మృతుడి భార్యకు రూ.7.50 లక్షలు మాత్రమే పరిహారం ఇచ్చిందన్నారు. దీనిపై కార్మిక శాఖ ద్వారా కేసు నమోదు చేయించామన్నారు. దీంతో గురువారం బాధిత కుటుంబానికి అదనంగా రూ.5,85,409 చెక్కును పంపారన్నారు. వర్కర్స్ యూనియన్ నాయకులు సిద్ధగిరి, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష దీపోత్సవం



దీపాలు వెలిగిస్తున్న మహిళా భక్తులు

అమరాపురం: స్థానిక మడకశిర రోడ్డులోని షిర్డిసాయిబాబా ఆలయంలో గురువారం రాత్రి లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు నరసింహ భట్టార్, హరీష్ భట్టార్ స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. మహిళలు తెచ్చిన దీపాలను ఆలయ ప్రాంగణంలో వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఏటా కార్తీక మాసం చివరి గురువారం లక్ష దీపోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం వచ్చిన భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చిలమత్తూరు: మొరంపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై గురువారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి చిలమత్తూరుకు చెందిన బాలకృష్ణ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ధ్వజం



విలేకర్లతో మాట్లాడుతున్న ఈరలక్కప్ప

మడకశిర: రాష్ట్ర ప్రజలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా మోసం చేస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ధ్వజమెత్తారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. హామీల అమలుపై ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడమే కూటమి సర్కారు సాధించిన అభివృద్ధి అని ఎద్దేవా చేశారు. సంక్షేమ విప్లవం సృష్టించిన గత జగన్ పాలనను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. హామీలు విస్మరించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని తెలిపారు.

కూటమి ప్రభుత్వం శాడిస్టు పాలన



మాట్లాడుతున్న వేణురెడ్డి

హిందూపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శాడిస్టు పాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలో వచ్చినప్పటి నుంచి రెడ్‌బుక్ పాలన చేస్తూ రాష్ట్రంలో భయభ్రాంతులు సృష్టిస్తున్నారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలకు రక్షణ కొరవడిందన్నారు. ఐదున్నర నెలల్లో రాష్ట్రంలో 110 మంది మహిళలు, చిన్నారుల మీద అత్యాచారాలు జరిగాయని, అందులో 11 మంది మరణించారన్నారు. యువతకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వడం లేదని అసెంబ్లీ సాక్షిగా తేల్చారన్నారు. వలంటీర్లకు నెలకు రూ.10 వేతనం ఇస్తామని చెప్పి మొత్తం 2.6 లక్షల మంది పొట్టగొట్టారన్నారు. విద్యార్థులకు విద్యాదీవెన, వసతిదీవెన కింద రూ.3,900 కోట్లు బకాయిలు చెల్లించడం లేదన్నారు. రవాణా చార్జీల పేరుతో ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు.

'సూపర్ సిక్స్' హామీలు గాలికి

రొళ్ల: సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా సర్కారు గాలికి వదిలేసిందని జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి విమర్శించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి, వలంటీర్ల జీతం పెంపు, రైతులకు అన్నదాతా సుఖీభవ పథకం కింద రూ.20వేల సాయం, తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు బడికి వెళ్తే అంతమందికీ రూ.15వేల చొప్పున తల్లి ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఐదు నెలలు గడిచినా పట్టించుకోలేదన్నారు. హామీల అమలు కోసం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

సేవాతత్పరుడు ముస్తాక్ అహ్మద్



మౌలానా ముస్తాక్‌ను సన్మానిస్తున్న ఉమర్ ఫారూక్‌ఖాన్ తదితరులు

హిందూపురం అర్బన్: మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ నిరంతర సేవా కార్యక్రమాలతో సేవాతత్పరుడిగా నిలిచారని అఖిల భారత ఫ్రీడమ్ ఫైటర్ షహీద్ టిప్పూ సుల్తాన్ యునైటెడ్ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం సడ్లపల్లిలోని మదరసాలో మదరసా ప్రిన్సిపాల్ మౌలానా అబ్దుల్ జబ్బార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అఖిల భారత ఫ్రీడమ్ ఫైటర్ షహీద్ జాతీయ సేవా పురస్కారం అందుకున్న మౌలానా ముస్తాక్ అహ్మద్‌ను ఘనంగా సన్మానించారు. సామాజిక సేవా అధ్యక్షుడు అజ్మతుల్లా, మౌలానా ఉస్మాన్, మౌలానా ముజ్జర్, ఇస్మాయిల్, ఖాజీ అన్సార్, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

చిలమత్తూరు(లేపాక్షి): స్థానిక వీరభద్రస్వామి ఆలయ హుండీ కానుకలను శుక్రవారం లెక్కించనున్నట్టు ఆలయ ఈఓ నరసింహమూర్తి తెలిపారు. ఆలయ కమిటీ చైర్మెన్, సభ్యులు, గ్రామపెద్దల సమక్షంలో లెక్కింపు చేపడతామన్నారు.

పుస్తకాల వివరాలు పంపండి



గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న కార్యదర్శి రమ

మడకశిర: పట్టణంలోని గ్రంథాలయాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తనిఖీ చేశారు. పాఠకుల డిమాండ్ మేరకు గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాల వివరాలను పంపాలని ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి శ్రీనివాసులుకు సూచించారు. అనంతరం మున్సిపల్ అధికారులను కలిసి గ్రంథాలయానికి రావాల్సిన సెస్‌ను వెంటనే చెల్లించాలని కోరారు.

రెండో వార్డులో తాగునీటి ఎద్దడి

రొళ్ల: మండల కేంద్రంలోని రెండో వార్డులో నెల రోజులుగా నీటి ఎద్దడి నెలకొంది. వార్డులో 70కి పైగా కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. అయితే విద్యుత్ మోటారు చెడిపోయి నెల రోజులు కావస్తున్నా ఇప్పటివరకు మరమ్మతుకు నోచుకోకపోవడంతోనే సమస్య తలెత్తిందని వార్డు ప్రజలు తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. లేనిపక్షంలో ఖాళీ బిందెలతో మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.